క్లుప్తంగా

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జోగిపేట(అందోల్): పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకునే చర్యలపై జోగిపేట అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని మాసానిపల్లి శివారులోని ఆయిల్ కంపెనీలో అగ్నిప్రమాదాలపై డెమో నిర్వహించారు. ముందుగా అగ్నిప్రమాదం జరగకుండా తీసుకునే జాగ్రత్తలపై వివరించారు. అనుకోకుండా జరిగే ప్రమాదాలను ఎలా నివారించాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు, ఆపరేటర్ రామకృష్ణ, ఫైర్‌మెన్‌లు గణేష్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



జహీరాబాద్: అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మనూరు(నారాయణఖేడ్): సీపీఆర్‌పై మండల ప్రజాప్రతినిధులకు మంగళవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మనూరు వైద్యాధికారి రవి మాట్లాడుతూ గుండెపోటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి అందించాల్సిన చికిత్సవిధానాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టి అవగాహన కల్పించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సీపీఆర్ విధానాన్ని తెలియపర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షాజిలోద్దిన్, సర్పంచ్‌లు శివాజీరావు, విఠల్‌రావుపాటిల్, మష్నాజీ పాల్గొన్నారు.

జహీరాబాద్: సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మికంగా ఎవరైనా అస్వస్థతకు గురైతే వారికి వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో మెప్మా, మున్సిపల్ సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లకు వైద్యులు సాహాయిల్ జునైద్, నవనీత్, హెల్త్ సూపర్‌వైజర్ హేమలత పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించాలని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారులకు బ్యాడ్మింటన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కోచ్ చంటీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని అంబేడ్కర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రం వద్దకు కాలనీవాసులు చేరుకొని సమస్యలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రం రెండు ఒకే భవనంలో ఉన్నాయని, ప్రస్తుతం భవనం శిథిలావస్థలోకి చేరుకుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

డివిజన్ అభివృద్ధి కృషి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలుచోట్ల సోమవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం, ప్రధాన ముఖద్వారం వద్ద, సింఫనీ పార్క్‌హోమ్స్ కాలనీ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన నూతన ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు. అదేవిధంగా శ్రీరామ్‌నగర్ కాలనీలో దుర్గామాత ఆలయం వద్ద లైటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, మాజీ వార్డుకమిటీ సభ్యుడు కొండల్, శ్రీరామ్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదకొండు రోజుల్లోనే పోగొట్టుకున్న ఫోన్ దొరికింది. బీహెచ్‌ఈఎల్‌లో నివాసముండే నాగాదేవి ఈ నెల 7వ తేదీన టెంపుల్‌కు వెళ్లింది. అక్కడ సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. సీఈఐఆర్ పోర్టల్‌లో తన ఫోన్ వివరాలు నమోదు చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసి ఫోన్‌ను కనిపెట్టి బాధితురాలికి మంగళవారం రాత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నరసింహారావు, సీఐ సంజయ్‌కుమార్, డీఐ ప్రతాప్, ఎస్‌ఐ నరసింహులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పథకాలు దేశానికి ఆదర్శం

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



రామచంద్రాపురం: కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలో షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల కుటుంబంలో ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, డబుల్‌బెడ్‌రూం, దళితబంధు, రైతుబీమా తదితర పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ జయరాం, తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కార్పొరేటర్‌లు పుష్పనగేష్, సింధుఆదర్శ్‌రెడ్డి, కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం, భారతనగర్ డివిజన్ పరిధిలోని ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పుష్పనగేశ్, సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్, నాయకులు పరమేశ్‌యాదవ్, దేవేందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

పటాన్‌చెరు: మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఇప్పటికే రూ.5కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. రోడ్లతో పాటు యూజీడీలు, మిషన్ భగీరథ, పరిశుభ్రత పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ పాల్గొన్నారు.

కులసంఘాలకు సహకారం అందిస్తాం..

పటాన్‌చెరు టౌన్: కుల సంఘాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాజు, గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన బుచ్చయ్యను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ఇఫ్తార్ విందులు మత సామరస్యాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి మొగుడంపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి జీవించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అన్ని అనుమతులు ఉన్నాయి..

అన్ని అనుమతులు తీసుకునే పాఠశాలలను నడుపుతున్నామని, కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రైవేటు విద్యాసంస్థల(ట్రస్మా) యాజమానులు పేర్కొన్నారు. మంగళవారం జహీరాబాద్‌లో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాలలపై జరుగుతున్న దుష్ప్రచారంపై చర్చించారు. గుర్తింపు లేకుండా కొన్ని పాఠశాలలు నడుపుతున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ చేస్తున్న ప్రచారంలో వాస్తవంలేదని ఖండించారు. జహీరాబాద్ పట్టణంలోని శాంతినికేతన్, బ్రిలియంట్, లైసియం, విద్యాభారతి పాఠశాలలకు అనుమతులు లేకుండా నడుపుతున్నారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడని, ఇందులో వాస్తవం లేదని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు పాఠశాలలకు చెందిన కరస్పాండెట్లు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కార్యక్రమంలో మహిళలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ సెంటర్‌లలో బెల్ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు శాంతివరదరాజన్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బెల్ ఈడీ టీఎస్ వరదరాజన్, జీఎం ఇన్‌చార్జి సుధీర్‌బాబు హాజరై మహిళ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో జీఎం హెచ్‌ఆర్ మగేంద్రవర్మన్, మాలతి, ఏజీఎం సుజన పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్) ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మేడికుందా శివారులోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో వట్‌పల్లి, రేగోడ్, అల్లాదుర్గ్ మండలాలకు చెందిన 98 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. అనంతరం ముస్లింలకు రంజాన్ దుస్తులను అందజేశారు. సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు సురేఖ, ఎంపీపీ పత్రి క్రిష్ణవేణి, జెడ్పీటీసీ అపర్ణ, వరం చైర్మన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, డైరెక్టర్ బుద్దిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘ముఖాముఖి’



మాట్లాడుతున్న కార్పొరేటర్, అధికారులు

పటాన్‌చెరు టౌన్: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టిందని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫనీపార్క్ హోమ్స్‌కాలనీలో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ బాలయ్య మాట్లాడుతూ కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వేజర్ వెంకటేశ్, డీఈ క్రాంతి, ఏఈ శివకుమార్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్‌కు వేతనం అందజేత



వేతనం అందజేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కొడకంచి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న విద్యావలంటీర్‌కు చిట్కుల్ సర్పంచ్ నీలంమధు నెల వేతనం రూ.10వేలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యావాలింటీర్ నీలం మధుకు కృతజ్ఞతలు చెప్పారు. ప్రతినెల విద్యావాలింటీర్‌కు నీలం మధు వేతనం అందించేవిధంగా చర్యలు తీసుకుంటున్నారని స్థానిక నాయకులు శ్రీనివాస్ తెలిపారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న నందీశ్వర్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని పెద్దమ్మగూడ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ నిర్మాణంలో భాగంగా శ్లాబు వేయించిన మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్‌ను ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు.

అయ్యప్పస్వామికి ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో అయ్యప్పస్వామి ఆలయం 15వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌విజయ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అలయ నిర్వహకులు నర్ర భిక్షపతి, సంజీవరెడ్డి ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మండుటెండలో చల్లని నేస్తాలు



వేసవితాపం నుంచి ఉపశమనం పొందాలంటే చల్లని శీతల పానీయాలు, పండ్ల రసాలు తప్పనిసరి. ఏటా వేసవిలో మట్టిరంజన్, కుండలు, కూలర్లు, ఏసీల అమ్మకాలు జోరందుకుంటాయి. జిల్లాలోని సదాశివపేట, జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, జోగిపేట, జిన్నారం, బొంతపల్లి, అమిన్‌పూర్, తెల్లాపూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం ప్రధాన కూడళ్లలో జ్యూస్ సెంటర్లు, కొబ్బరిబొండాలు, ఖర్బూజాలు, పుచ్చకాయల దుకాణాలు వెలిశాయి. మరోవైపు పేదింటి ఫ్రిడ్జ్‌గా పేరొందిన మట్టికుండలు, రంజన్‌లను ఏర్పాటు చేశారు.

– సదాశివపేట(సంగారెడ్డి)





పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా శవయాత్ర



పరిశ్రమ యజమాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న రైతులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామ శివారులోని సురభి లాబరేటరీ పరిశ్రమ నిర్మాణాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పరిసర గ్రామాల ప్రజలు చేపట్టిన నిరసన మంగళవారం 12వ రోజుకు చేరుకుంది. మంగళవారం మధ్యాహ్నం వడ్డేపల్లిచౌరస్తా నుంచి పరిశ్రమ వరకు శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి పరిశ్రమ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీ మంగమ్మ, ఉపసర్పంచ్ సురేష్‌గౌడ్, తెలంగాణ జాగృతి జిల్లా కన్వీనర్ దండు ప్రవీణ్ రావు, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కర్రె కృష్ణ యువజన కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలను పరిష్కరించాలి



జిన్నారం: దీక్షకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే, గోదావరి

జిన్నారం(పటాన్‌చెరు): ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గోదావరి డిమాండ్ చేశారు. గుమ్మడిదలలో ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెకు మంగళవారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఐకేపీ వీఓఏలు పాల్గొన్నారు.

రెండో రోజుకు ఐకేపీ వీఓఏల నిరాహార దీక్షలు

పుల్‌కల్(అందోల్): సమస్యల పరిష్కారానికి ఐకేపీ వీఓఏలు చేస్తున్న నిరవధిక నిరాహారదీక్ష రెండో రోజుకు చేరుకుంది. వీవోఏల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రెండు రోజు వీవోఏల నిరాహారదీక్షకు సీఐటీయూ జిల్లా కమిటీ సంఘీభావం తెలిపింది.

వీఓఏల పట్ల మొండివైఖరి తగదు

జహీరాబాద్ టౌన్: ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏల పట్ల ప్రభుత్వ మొండివైఖరి అవలంభిస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న వీఓఏలను కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్, వీఓఏల యూనియన్ నాయకులు ఆశోక్ పాల్గొన్నారు.

ఝరాసంగం మండల కేంద్రంలో..

ఝరాసంగం(జహీరాబాద్): తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరుకుంది. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగం ఐకేపీ కార్యాలయం ఆవరణలో సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో వీఓఏలు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా ప్రకటించాలి

జోగిపేట(అందోల్): ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా ప్రకటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. మంగళవారం ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మల్లన్న, లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, గోపాల్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్ మండల కేంద్రంలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని ఏకేపీ కార్యాలయం ఆవరణలో చేపట్టిన వీఓఏల సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.10లక్షలు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు నాగేందర్, నాగరాణి, శివకుమార్, శరణప్ప, లావణ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బాధిత కుటుంబానికి ఆర్థికసాయం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ అనారోగ్యంతో బాధపడుతున్న తస్లీమ్‌బేగంకు ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదీర్ మంగళవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ పాల్గొన్నారు.

◆ **రెండోసారి సర్వసభ్య సమావేశం వాయిదా**

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కూడా కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా పడగా మళ్లీ కోరంలేని కారణంగా రెండో మారు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీపీ రాథోడ్ మోతిబాయి, జెడ్పీటీసీ రాథోడ్ రాజునాయక్‌లు హాజరుకాగా కోరం లేకపోడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

◆ **చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం**

పటాన్‌చెరు టౌన్: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో.. బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే సోదరుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట గ్రామంలో స్థానికుడు మల్లేష్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

◆ **వీఆర్‌ఏ సస్పెన్షన్**

హత్నూర(సంగారెడ్డి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్‌ఏను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణగూడ వీఆర్‌ఏగా పనిచేస్తున్న రవీందర్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంతో మెమో జారీ చేయగా, సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మంగళవారం సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని ఆమె పేర్కొన్నారు.

◆ **మైనార్టీల సంక్షేమానికి కృషి**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ కుమారుడు చింతా సాయినాథ్ అన్నారు. నందికంది గ్రామంలో సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథ్ ప్రార్థనలు నిర్వహించారు.

◆ **విద్యార్థులకు ప్రతిభ అవార్డులు**

జహీరాబాద్ టౌన్: ఇటీవల సుచిరిండియా ఫౌండేషన్ నిర్వహించిన నేషనల్ లెవెల్ టాలెంట్ పరీక్షలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి అవార్డులు సాధించారని డాక్టర్ ఆర్ఎల్ఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు.

◆ **నేడు కుస్తీపోటీలు**

నారాయణఖేడ్: మండలంలోని నర్సాపూర్ గ్రామంలో ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కుస్తీపోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చివరి కుస్తీలో విజేతకు 5తులాల వెండి కడియాన్ని బహుమతిగా అందించనున్నట్లు ఆయన తెలిపారు.

◆ **ఎస్ఎస్ఎమ్ గోల్డెన్ టౌన్‌షిప్ పరిశీలన**

సంగారెడ్డి టౌన్: మండల పరిధిలోని కులబ్‌గూర్ గ్రామంలోని ఎస్ఎస్ఎమ్ గోల్డెన్ టౌన్‌షిప్‌ను మంగళవారం అధికారులు తనిఖీలు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు పరిశీలించి కలెక్టర్ నుంచి క్లియరెన్స్ వచ్చేంతవరకు పనులు నిలిపివేయాలని నోటీసులు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

◆ **హక్కులపై అవగాహన తప్పనిసరి**

సంగారెడ్డి టౌన్: గృహహింస, కార్మిక హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ కేవీ రమణ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఇండ్లలో పనిచేస్తున్న గృహకార్మికులకు హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే 100కు డయల్ చేయాలని సూచించారు.

◆ **ఆలయ నిర్మాణానికి చెక్కు అందజేత**

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లిలో నిర్మిస్తున్న బంగోండేశ్వర్ మందిర నిర్మాణానికి జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నాయకులు అరుణవిజయమోహన్‌రెడ్డి రూ.25 వేల చెక్కును అందజేశారు.

◆ **విరాళం అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ఈనెల 21నుంచి నిర్వహించనున్న బీరప్పస్వామి, కామరాతి దేవతల కల్యాణ మహోత్సవానికి మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ రూ.1.50లక్షల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

◆ **ఇఫ్తార్‌విందులో శ్రీనివాస్‌గౌడ్**

జిన్నారం: మండలంలోని మంగంపేట గ్రామంలో నిర్వహించిన ఇఫ్తార్‌విందులో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

◆ **ఖేడ్‌లో యజ్ఞ సినిమా షూటింగ్**

నారాయణఖేడ్: పట్టణంలో మంగళవారం సంతరోజు యజ్ఞ చిత్ర నిర్మాణానికి సంబంధించి షూటింగ్ నిర్వహించడంతో జనాల సందడి నెలకొంది. ఆర్ఆర్ మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముప్పారంకు చెందిన సుభాష్‌రావు దేశ్‌పాండే సమర్పణలో చిలుకోడి రఘురాం నిర్మాతగా, ఆకుల లింగాపూర్‌కు చెందిన విఠల్‌గౌడ్ సహ నిర్మాతగా యజ్ఞ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కథానాయకుడిగా శివ, కథానాయకురాలిగా గోవాజ్యోతితో పాటు కమేడియన్ నటులు సుమన్‌శెట్టి, దీపికలు నటిస్తున్నారు. ఖేడ్ పట్టణంలో యజ్ఞచిత్రం చిత్రీకరణను జనాలు ఆసక్తితో తిలకించారు.

◆ **ఉచిత కుట్టుశిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం**

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళలకు వచ్చేనెలలో ఉచిత కుట్టుశిక్షణ ఇవ్వనున్నట్లు ఖేడ్ శిక్షణా కేంద్రం ఇన్‌చార్జి నగేష్ పేర్కొన్నారు. ఖేడ్ బస్తీ దవాఖాన పక్కన ఉన్న పాత ఐకేపీ భవనంలో ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ **ప్లీనరీకి తరలిన ఫొటో, వీడియో యూనియన్ నాయకులు**



సంగారెడ్డి టౌన్: హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ప్లీనరీకి సంగారెడ్డి నుంచి ఫోటో, వీడియోగ్రాఫర్లు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి నాయకులు కృషి చేయాలని వారకు కోరారు. ఈ ప్లీనరీకి రాష్ట్రంలోని ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు హాజరుకానున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు.